

తెలంగాణ భవన్‌కు తరలివెళ్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

## తెలంగాణ భవన్‌కు తరలిన నాయకులు

గోపాల్‌పేట, అక్టోబర్ 29: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించినన బీఆర్ఎస్వీ రాష్ట్ర స్థాయి సమావేశానికి గోపాల్‌పేట, రేవల్లి మండలాల నుంచి బీఆర్ఎస్వీ నాయకులు తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు శ్రావణ్ కుమార్, మండల సోషల్ మీడియా కన్వీనర్ బొగ్గు శివకుమార్, మండల యూత్ అధ్యక్షుడు రాజేశ్ ఆచారి, నాయకులు లాలునాయక్, లింగస్వామి, శంకర్‌గౌడ్, అక్షిత్, లోకేశ్, అంజి, బాలరాజు, మహేశ్, ముణేశ్, రాజు, వంశీ, శివ, బాలరాజు తదితరులు ఉన్నారు.

## తనిఖీల్లో రూ.లక్ష పట్టివేత

పెబ్బేరు, అక్టోబర్ 29: ఎన్నికల నేపథ్యంలో పోలీసుల తనిఖీలు ముమ్మరం చేశారు. ఆధారాలు లేకుండా తరలిస్తున్న డబ్బును స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తున్నారు. తాజాగా ఆదివారం పెబ్బేరు మండలం గుమ్మడం క్రాస్‌రోడ్డు వద్ద బైకుపై తరలిస్తున్న రూ.లక్ష పట్టుకొని అలంపూర్ మండలంలోని క్యాతూరుకు చెందిన వంశీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు.

**పాన్‌గల్ రోడ్డులో మద్యం బాటిళ్లు**

వనపర్తి టౌన్, అక్టోబర్ 29: జిల్లా కేంద్రంలోని పాన్‌గల్ రోడ్డులోని ఫరీద్ మిల్లు వద్ద పట్టణ ఎస్సై యుగంధర్‌రెడ్డి ఆదివారం వాహన తనిఖీ చేశారు. మెట్టుపల్లికి చెందిన కిరాణా వ్యాపారి రంగం రాములు మద్యం షాపు నుంచి మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి తీసుకెళ్తున్నాడు. బైక్ తనిఖీ చేయగా 17క్వాటర్లు, 2ఫుల్ బాటిళ్లు లభ్యమయ్యాయి. బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## మహిళ అదృశ్యం

వనపర్తి టౌన్, అక్టోబర్ 29: జిల్లా కేంద్రంలో మహిళ అదృశ్యమైన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. ఎస్సై యుగంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. చిన్నంబావి మండలం పెద్దదగడకు చెందిన శ్రీనివాసులు కూతురు తిరుమలేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్నది. ప్రైవేట్ హాస్టల్‌లో ఉండేది. శనివారం తిరుమలేశ్వరి తండ్రి ఫోన్‌లో పెళ్లి సంబంధం చూశామని, ఆదివారం ఉదయం వరకు ఊరికి రావాలని చెప్పాడు. ఉదయం 9గంటల వరకు ఇంటికి చేరుకోకపోవడంతో 9:30గంటలకు ఫోన్ చేశాడు. అప్పటికే అమ్మాయి ఫోన్ స్విచ్ఛాప్ అవ్వడంతో అమ్మాయి స్నేహితులు, బంధువులను అడిగినా ఆచూకీ లభించకపోవడతో పెద్ద కూతురు భర్త నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

వనపర్తి టౌన్, అక్టోబర్ 29: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1959-65 సంవత్సరాల మధ్య చదివిన 1,2,3,4 బ్యాచ్‌లకు చెందిన పూర్వవిద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. కళాశాలలో చదువుతున్నప్పుడు వారి అనుభూతులు, వారికి బోధించిన గురువులను, ఆనాటి చదువులు, క్రమశిక్షణ, కళాశాల గొప్పతనాన్ని ఒకరికొకరి అనుభవాలను పంచుకున్నారు. వనపర్తి జిల్లాకే తలమానికంగా ఐకాన్‌గా నిలిచిన పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని వారన్నారు.కళాశాల విద్యార్థులకు మంచినీటి వసతి కోసం రూ.లక్షా50వేలు వెచ్చించి ఆర్వోప్లాంట్‌ను పూర్వ విద్యార్థులు వితరణ చేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పూర్వవిద్యార్థులు బాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మోహన్‌రావు, కుమారస్వామి ఉన్నారు.

## సెల్‌ఫోన్ అప్పగింత

గోపాల్‌పేట, అక్టోబర్ 29: మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కోరమోని ఉదయ్ ఈనెల 2వ తేదీన తన సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ సాంకేతికత ఆధారంగా పోయిన సెల్ ఫోన్‌ను పోలీసులు ట్రేస్ చేసి దొరికించుకున్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో సెల్ ఫోన్‌ను బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

# వ్యవ‘సాయం’

- అన్నదాతలకు అండగా సర్కారు
- 11విడుతల్లో రూ.1600కోట్ల సాయం
- ‘రైతుబంధు’తో మారిన స్వరూపం
- పెట్టుబడి సాయం పెంపుదల
- వచ్చే ఏడాది నుంచి ఎకరాకు రూ.12వేలు
- ఏడాది ఏడాదికి రూ.500 పెంపు
- ఐదేండ్లలో రూ.16వేల వరకు



వనపర్తి, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : మట్టి, కష్టాన్ని నమ్ముకున్న రైతన్నకు బీఆర్ఎస్ సర్కార్ అపన్నహస్తం అందిస్తున్నది. సమైక్యపాలనలో ఇబ్బందులు పడిన అన్నదాతకు కొత్త రాష్ట్రంలో నష్టాల ఊబీలో నుంచి గట్టెక్కె దశకు చేరుకుంటున్నారు. గడిచిన ఐదేండ్లుగా రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి నిరాటంకంగా అమలు చేస్తు న్నది. ఏడాది రెండు పంటలు పండించే వానకాలం, యాసంగి సేద్యం ప్రారంభం ముం దే రైతుబంధు సాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నది. పెరిగిన వ్యవసాయ పెట్టుబడుల నేపథ్యంలో సీఎం కేసీఆర్ మరోసారి పెట్టుబడి సాయాన్ని పెంపుదల చేస్తూ బీఆర్ఎస్ మ్యాని ఫెస్టోలో చేర్చి ప్రకటించారు. దీంతో అన్నదాతల్లో మరింత ఉత్సాహం నెలకొంది. 60 ఏండ్ల ప్రభుత్వ పాలనలో ఏఒక్క ప్రభుత్వం రైతుల గురించి ఆలోచించని తరు ణంలో సీఎం కేసీఆర్ ఈ బృహత్తర పథకాన్ని ప్ర వేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారు. 2018 మే10న సీజన్‌లో ఎకరాకు రూ.4వేల లెక్కన ఈ పథకాన్ని ప్రతి ష్టాత్మకంగా సీఎం కేసీఆర్ ప్రారంభం చేశారు. అయితే, 2019-20కి సంబంధించి సీజన్‌కు ఎకరాకు రూ.5 వేల చొప్పున ప్రక టించి, రెండు పంటలకు కలిపి రూ.10 వేలను అందిస్తున్నారు. ఇదిలా ఉంటే, ఈ ఏడాది 2023 వానకాలం సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు జిల్లాలోని 1,72, 617మంది రైతులకు రూ.181కోట్ల 18,11,946లను రైతుల ఖాతాల్లో జమ చేసింది.

**11 విడుతల్లో రూ.1600కోట్ల సాయం**

ఇప్పటి వరకు ఐదేండ్లలో జిల్లాలోని రైతులకు రూ.1602కోట్ల 2లక్షల రూపాయలను బీఆర్ఎస్ సర్కార్ అందించింది. జిల్లాలో లక్షా 64,479 మంది రైతులకు ఈ పథకంలో మేలు జరుగుతున్నది. సాంప్రదాయంగా సాగుతున్న వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని, రైతును అగ్రభాగాన నిలపాలన్న సదుద్దేశంతో దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని రీతిలో తెలంగాణ ప్రభుత్వం రైతుబంధును అమలు చేస్తున్నది. ఈ పథకం ద్వారా రైతులు ప్రైవేట్ అప్పుల బారిన పడటం దాదాపుగా తొలగిపోయింది. పెట్టుబడులకు ముందే సర్కారు డబ్బులు చేతికి అందుతుండటంతో ఆర్థిక అవస్థల నుంచి రైతన్న గట్టెక్కాడు. సాగుబడుల కోసం ఇటు ప్రాజెక్టుల నీళ్లు పెట్టుబడుల కోసం సర్కారు సాయంతో ప్రస్తుతం సేద్యం పండుగలా సాగుతున్నది. సేద్యం దండగా అన్న సమైక్యరాష్ట్ర నానుడి నుంచి పూర్తిగా రైతాంగం బయట పడింది. కొత్త రాష్ట్రంలో పుష్కలమైన వ్యవసాయం లాభసాటిగా చేస్తున్న రైతుల కండ్లలో ఆనందం కనబడేలా బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది.

**వచ్చే ఏడాది నుంచి..**

వ్యవసాయంపై ఆధారపడ్డ అన్నదాతలను మరింతగా ఆదుకోవాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. మారుతున్న కాలానుకనుగుణంగా రైతుబంధు పథకంలో మార్పులు చేస్తున్న సాయం పెంచుతున్న సీఎవ మళ్లీ వచ్చే ఏడాది నుంచి రైతుబంధును పెంచే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇటీవల బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో వచ్చే ఐదేండ్లలో ఎకరాకు రూ.16 వేల అందిస్తామని ప్రకటించారు. ఈ ప్రకటనతో రైతులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన ఐదేండ్లలో తమ ఖాతాల ద్వారా రైతుబంధును అందుకుంటున్న రైతాంగం సీఎం ప్రకటనతో పులకించిపోతున్నది. కొత్త రాష్ట్రం ఏర్పడగానే విద్యుత్ సమస్యను తొలగించి రైతుల కరెంట్ కష్టాలను కడతేర్చారు. రాత్రుళ్లు పొలాల దగ్గరకు వెళ్లి కరెంట్ ఎప్పుడు వస్తుందో..పోతుందో తెలియని నాటి రోజులకు...ఇప్పటి రోజులకు తేడాను గమనించి అన్నదాతలు ఆనందంగా సేద్యం చేసుకుంటున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో సాగు సహితం భారీగా పెరిగి ంది. ఏటికేటికీ సాగుబడుల లెక్కలు అంచనాలకు మించుతున్నాయి.అసెంబ్లీ ఎన్నికల అనంతరం వచ్చే ఏడాది నుంచి రైతుబంధును పెంపుదల చేస్తామన్న సీఎం కేసీఆర్ ప్రకటనతో రైతులు సంబురంలో పడ్డారు.

## ప్రభుత్వానికి రైతులు రుణపడి ఉంటారు.



వ్యవసాయం దండగ అన్నచోటే నేడు పండుగలా వ్యవసాయం చేసుకుంటున్నాం. గతంలో వ్యవసాయం చేయాలంటే చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొనేవారు. పెట్టుబడికి డబ్బులు లేక, ఎరువులు దొరకగా, సాగునీరు లేక, కరెంట్ సరిగ్గా ఉండేది కాదు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత అంతా మారిపోయింది. పుష్కలమైన సాగునీరు, 24గంటల విద్యుత్, పెట్టుబడి సాయం కింద ఎకరాకు ఏడాదికి ప్రభుత్వం నుంచి అందుతున్న రూ.10వేల సాయం. ఇప్పుడు ఆ సాయాన్ని వచ్చే ఐదేండ్లలో రూ.16వేలకు పెంచుతామని సీఎం కేసీఆర్ చెప్పడం సంతోషించదగ్గ విషయం. కేసీఆర్‌కు రైతులపై ఉన్న ప్రేమ అలాంటిది. ఆయన చెప్పాడంటే ఖ చ్చితంగా చేస్తాడు. రైతు కుటుంబాలు బాగుపడాలంటే మళ్లీ ఆయనే సీఎం కావాలి. కేసీఆర్ ప్రభుత్వానికి రాష్ట్ర రైతాంగం రుణపడి ఉంటుంది.

-నాగమణి మహిళా రైతు మదనాపురం

## కేసీఆర్ సారు ఇస్తంటే ఇస్తడు!



ఒకప్పుడు పంటకు పెట్టుబడి పెట్టాలంటే నా నా యాతనలు పడ్డోళ్లం. విత్తనాలకని, ఎరువులకని అవసరమయ్యే పైసల కోసం వడ్డీ వ్యాపారుల ఇండ్ల చుట్టూ తిరిగేటోళ్లం. నానా తిప్పలు పెట్టి వాళ్లు అధిక వడ్డీకి అప్పు లిచ్చేవాళ్లు. కేసీఆర్ పుణ్యాన ఆయనొచ్చాక ఇప్పటి వరకు అప్పుకు తిరగాల్సిన అవసరమే రాకపాయె. రైతుబంధు వచ్చినాక సర్కారే పెట్టుబడి పైసలు ఇయ్యవట్టె. ఎకరానికి రూ. పదివేలు లెక్కన ఏడాదికి రెండు పంటలకు ఇస్తుంటే అదే పెద్ద గొప్ప అని ఎంతో సంబురపడ్డాం. కానీ మళ్లా మా కేసీఆర్ పది వేలు కాదు పదహారు వేలు ఇస్తానంటున్నాడు. ఇది కలో నిజమో తెలవట్లేదు. అయినా కేసీఆర్ సారు ఇస్తా అంటే ఖచ్చితంగా ఇస్తడు. ఆయన మాట మీద మాకు నమ్మకముంది. రైతులకు ఎంతో బాగు చేస్తున్న బీఆర్ఎస్ సర్కారే మళ్లీ రావాలని మాలాంటి రైతులు అందరూ ఆశపడుతున్నరు.


-పటేల్‌గారి బాలయ్య, పెబ్బేరు

## ఆలయాల సంప్రోక్షణ

పెబ్బేరు, అక్టోబర్ 29: ఆదివారం తెల్లవారుజాము వరకు కొనసాగిన చంద్రగ్రహణం అనంతరం ఉద యంనుంచే ఆలయాల సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. పెబ్బేరు మండలంలోని పలు ఆలయాలను పూజారులు శుద్ధి చేశారు. అనంతరం భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు. సూగూరులోని చౌడేశ్వరీ ఆలయంలో తొగుట వీర క్షత్రియ సం ఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

**రంగనాథ స్వామి ఆలయంలో..**

శ్రీరంగాపురం, అక్టోబర్ 29: మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం చంద్రగ్రహణం పూర్తయిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ పూజారి విష్ణునారాయణ తెలిపారు. ఈ సందర్భంగా పూజారి విష్ణునారాయణ మాట్లాడుతూ.. చంద్రగ్రహణం అనంతరం ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో కోనేరు నుంచి తీసుకొచ్చిన ప్రత్యేక జలాలతో ఆలయం మొత్తం సంప్రోక్షణ చేసి ఉత్సవమూర్తులకు జలాభిషేకం నిర్వహించి రంగనాథస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజ లు నిర్వహించినట్లు తెలిపారు. గ్రహణం తర్వాత భక్తులు విరివిగా పాల్గొని రంగనాథస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.



సూగూరులో సంప్రోక్షణ చేస్తున్న పూజారులు

## పోలీసుల ఫ్లాగ్ మార్చ్

గోపాల్‌పేట, అక్టోబర్ 29: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల దృష్ట్యా ఆదివారం మండల కేంద్రంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఐటీబీటీ సెంట్రల్ ఫోర్స్‌కు చెందిన 52 మంది పోలీసులు కవాతులో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎన్నికలు సజావుగా జరిగేందుకు, ప్రజలకు భరోసా కలిగించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.